క్లుప్తంగా

8న ఫీల్డ్ అసిస్టెంట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

యానాం: ల్యాండ్ అండ్ సర్వే శాఖలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 8న జరిగే రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఏఓ మునిస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజీవ్‌గాంధీ ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ హైస్కూల్‌లోని కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష పర్యవేక్షణకు ఇద్దరు సూపర్‌వైజర్‌లు, నలుగురు అసిస్టెంట్ సెంటర్ సూపర్‌వైజర్లు, 24 మంది ఇన్విజిలేటర్లు, నలుగురు రిజర్వు ఇన్విజిలేటర్లు, ఆరుగురు సపోర్టింగ్ స్టాఫ్, ఎనిమిది మంది ఎంటీఎస్ స్టాఫ్‌ను నియమించినట్లు తెలిపారు.

రోగులకు పండ్ల పంపిణీ

యానాం: పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు, పీసీసీ అధ్యక్షుడు వి.వైతిలింగం పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లాడి సత్తిబాబు, బీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం నిల్వల పట్టివేత



పట్టుకున్న నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఈబీ పోలీసులు

అల్లవరం: అల్లవరం మండలం కోడూరుపాడు పంచాయతీ పరిధిలో గుడ్డివానిచింత వద్ద ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను ఎస్ఈబీ పోలీసులు గురువారం దాడి చేసి పట్టుకున్నారు. దాడిలో రూ.1.60 లక్షలు విలువ చేసే 560 మద్యం బాటిళ్లు, 20 బీరు టిన్నులు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ ఎస్ఐ స్వామిరెడ్డి తెలిపారు. ఘటనలో మామిడిశెట్టి వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకుని మద్యం రవాణాకు ఉపయోగిస్తున్న మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది నూతనప్రసాద్, కరుణ, తాతారావు, వీఆర్ఓ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిరంగు కుటుంబానికి పలువురి పరామర్శ



వెంకటలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ఉప్పలగుప్తం: మాతృ వియోగంతో బాధపడుతున్న భీమనపల్లి సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు కుటుంబీకులను పలువురు పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. మండలంలోని భీమనపల్లి పంచాయితీ పరిధి సూదాపాలేనికి చెందిన మాజీ డీసీసీబీ చైర్మన్ దివంగత శిరంగు కుక్కుటేశ్వరరావు సతీమణి శిరంగు వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె కుమారులు శిరంగు సత్తిరాజు, నాగకుమార్, కుటుంబీకులను పలువురు పరామర్శించి ఆమె చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు పెయ్యిల రాజ్‌కుమార్, పరమట శ్యామ్, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి తదితరులున్నారు.

కెరీర్ గైడెన్స్ శిక్షణకు ఎంపిక



ఝాన్సీరాణి

తాళ్లరేవు: కర్నాటకలోని మైసూర్‌లో కెరీర్ గైడెన్స్‌పై ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ జరగనున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి తాళ్లరేవు మండలానికి చెందిన పి.ఝాన్సీరాణి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్య, పరిశోధనా మండలి డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం ఝాన్సీరాణి తాళ్లరేవు మండలం చినవలసల ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర స్థాయి శిక్షణకు ఎంపికైన ఝాన్సీరాణిని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓలేటి వీవీ శాస్త్రి తదితరులు అభినందించారు.

జార్జిపేటలో అన్నసమారాధన

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట కోనేరు వద్ద గల శ్రీరామాంజనేయ స్వామివారి ఆలయంలో గణపతి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పితాని బాలకృష్ణలు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వారిద్దరినీ సత్కరించారు.

నిధులు రావు.. పనులు కావు

- నత్తనడకన జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం
- నాలుగున్నరేళ్లు గడిచినా పూర్తికాని పనులు

యానాం: ఏళ్లు గడుస్తున్నా గిరియాంపేటలో చేపట్టిన జాతీయ ఇంజినీరింగ్ కళాశాల పనులు మాత్రం పూర్తి కావడం లేదు. భూమి పూజ చేసి నాలుగున్నరేళ్లు దాటిపోయినా ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. స్థానికంగా కళాశాల నిర్మాణం పూర్తయితే పుదుచ్చేరి లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బాధ తప్పుతుందనుకుంటున్న విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుతం పరిస్థితి చూస్తుంటే వచ్చే విద్యా సంవత్సరంలోనైనా తరగతులు మొదలవుతాయో లేదోనన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

నత్తకు నేర్పిన నడకలివి

ఫిబ్రవరి 3, 2019న గిరియాంపేటలో జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి ప్రధాని మోడీ వర్చువల్ విధానం ద్వారా జమ్ముకాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి శంకుస్థాపన చేశారు. రూ.26 కోట్ల రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్(రూసా) నిధులను కేటాయించారు. కళాశాలలో రోబోటిక్ ఆటోమేషన్, జియో ఇన్ఫర్మేటిక్స్ ఇంజినీరింగ్, 3డీ యానిమేషన్, గ్రాఫిక్స్ ఇంజినీరింగ్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఇంజినీరింగ్, కంప్యూటింగ్ ఇన్ మల్టీమీడియా ఇంజినీరింగ్ తదితర అధునాతన సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లుగా ప్రకటించారు. నాటి నుంచి నత్తనడకన సాగుతున్న పనుల కారణంగా నేటికీ పూర్తిస్థాయిలో సివిల్ పనులే పూర్తి కాలేదు. ఎక్కడికక్కడ అసంపూర్తి భవనాలే దర్శనమిస్తున్నాయి.

అయితే పనుల్లో జాప్యం కారణంగా ఇప్పటికే నాలుగేళ్లు గడిచిపోవడమే కాకుండా నిర్మాణం పూర్తికి వ్యయం పెరిగిపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాలకు ఏఐసీటీఈ నుంచి సైతం అనుమతులు లభించినా నిర్మాణం పూర్తికాక తరగతులు ప్రారంభం కాలేదు. స్థానిక పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ)అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నట్లు చెబుతున్నా అడుగు కూడా ముందుకు కదలడం లేదు.

మూడు బ్లాక్‌లే పూర్తి

ఇంజినీరింగ్ కళాశాలకు మూడు బ్లాక్‌లను నిర్మించారు తప్ప గదులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇంకా రహదారులు, ప్రహరీ, డ్రైనేజీ నిర్మాణంతో పాటు కళాశాల ఎదురుగా ఉన్న స్థలాన్ని మట్టితో కప్పాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ పనుల్ని పుదుచ్చేరిలోని కాంట్రాక్టర్‌కు అప్పగించినా వాటిని ప్రారంభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు మిగతా పనులు పూర్తి చేయాలంటే మరో రూ.25 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించి ప్రతిపాదనల్ని ఉన్నతాధికారులకు పంపించినట్లుగా సమాచారం. ఆ ప్రతిపాదనలకు ఆమోదం ఎప్పుడొస్తుందో, నిధులెప్పుడొస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే వచ్చే విద్యా సంవత్సరంలో ఇక్కడ తరగతులు ప్రారంభం కావడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గిరియాంపేటలో నిర్మితమవుతున్న జాతీయ ఇంజినీరింగ్ కళాశాల భవనం

> **మరిన్ని నిధులు అవసరం**
>
> జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తి చేయడానికి మరిన్ని నిధులు అవసరం. మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఏయే పనులకు ఎంతెంత వ్యయమవుతుందో తెలుపుతూ అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. అక్కడి నుంచి నిధులు విడుదల కాగానే త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం.
>
> – భాస్కర్, పీడబ్ల్యూడీ ఇంజినీర్, యానాం

మళ్లీ సీఎంగా జగనే రావాలి

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని, ఆ దిశగా కార్యకర్తలందరూ కృషి చేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మండల పార్టీ అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా సీఎంగా మళ్లీ జగనే రావాలన్నారు. ఈ ఆవశ్యకతను తెలియజేసేలా గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామస్థాయి పార్టీ అధ్యక్షులు పార్టీ జెండాను ఎగురవేయాలని, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, దొమ్మేటి శామ్యూల్ సాగర్, కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, రేవు మల్లీశ్వరి, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, రెడ్డి రెడ్డిబాబులు పాల్గొని పార్టీ విజయానికి చేపట్టాల్సిన అంశాలను వివరించారు.



తాళ్లరేవులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

డ్వాకా సంఘాల వివరాలు నమోదు చేయాలి

అల్లవరం: మండలంలోని 22 సచివాలయాల పరిధిలోని 1,705 డ్వాక్రా సంఘాల వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ యానిమేటర్లను ఆదేశించారు. అల్లవరంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించారు. డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాలు, సభ్యుల సమాచారం, పొందిన రుణాలు తదితర వివరాలు అప్‌లోడ్ చేయాలని, సాంకేతిక సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నమోదులో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎం సయ్యద్, ప్రశాంతి, సత్తిబాబు పాల్గొన్నారు.

కాంట్రాక్టు నర్సుల విధుల పొడిగింపు

యానాం: కరోనా సమయంలో కాంట్రాక్టు పద్ధతిన విధుల్లో చేరిన నర్సుల ఉద్యోగ విధుల గడువును మరో 3 నెలలు పొడిగించడంతో పాటు జీతాలు సైతం పెంచనున్నట్లు సీఎం రంగసామి హామీ ఇచ్చారు. గురువారం ఆయనను కాంట్రాక్టు నర్సులు కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ప్రతీ మూడు నెలలకోసారి కాంట్రాక్టు నర్సుల విధులను పొడిగిస్తున్నారని, అయితే గత జూలై నెల నుంచి పొడిగింపు ఉత్తర్వులు రాలేదని ఆయనకు చెప్పారు. దీనికి స్పందించిన సీఎం రంగసామి మాట్లాడుతూ కోవిడ్‌లో నియమించిన కాంట్రాక్టు నర్సులను తొలగించాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అయినా కాంట్రాక్టు నర్సులకు న్యాయం జరిగేలా కాంట్రాక్టును మరో 3 నెలలు పొడిగించి వారి జీతాలను పెంచేందుకు సంబంధించిన ఫైలును ఎల్జీ తమిళిసైకు పంపుతానని హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టు నర్సులు సీఎం రంగసామికి కృతజ్ఞతలు తెలిపారు.

పేద మహిళకు సాయం

అమలాపురం టౌన్: స్థానిక గొల్లగూడెంలో భర్తను పోగొట్టుకుని ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న దాసం లక్ష్మి అనే పేద మహిళకు అబ్బిరెడ్డి ట్రస్ట్ ఫౌండేషన్ రూ.10 వేల సాయం సమకూర్చింది. ఫౌండేషన్ ప్రతినిధులు అబ్బిరెడ్డి సురేష్, మల్లేష్ సోదరులు ఈ మొత్తాన్ని బాధిత మహిళలకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో సూరపురెడ్డి సురేష్, ఆకుల ఈశ్వరరావు, గుర్రాల రమేష్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

అమలాపురం రూరల్: కిమ్స్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ ఆర్థోడొంటిక్స్ డే సందర్భంగా మిరియం స్కూల్, డిగ్రీ కళాశాలలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఒకదాని మీద మరో పన్ను రావడం, ఎత్తు పళ్లు వంటి దంత సమస్యలతో బాధపడేవారికి అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని దంత వైద్యుడు డాక్టర్ హర్ష తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివకుమార్, మేనేజర్ విజయ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు వాకర్స్ వితరణ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠం ప్రేమ మందిరంలో పెరుగుతున్న అనాథ పిల్లలకు వాకర్స్ హెల్త్ క్లబ్ రూ.12 వేల విలువైన నూతన వస్త్రాలను గురువారం వితరణగా సమకూర్చింది. క్లబ్ సభ్యుడు గ్రంథి సతీష్ కిరాణా సామగ్రి అందించారు. క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి తన కవల కుమార్తెలు సరస్వతి, లక్ష్మి చేతుల మీదుగా నూతన వస్త్రాలు సమకూర్చారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, వలవల నాయుడు, యర్రమిల్లి సతీష్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

డీఎస్పీ అంబికా ప్రసాద్ సూచన

అమలాపురం టౌన్: ఈ నెల 25న అమలాపురంలో నిర్వహించే దసరా ఉత్సవాలు, చెడీ తాలింఖానా ఊరేగింపులను ఏడు వీధుల వాహన నిర్వాహకులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆయా వీధుల పెద్దలకు సూచించారు. పట్టణంలో దసరా ఊరేగింపులు నిర్వహించే వీధులకు డీఎస్పీ అంబికా ప్రసాద్, పట్టణ, రూరల్ సీఐలు టి.క్రాంతికుమార్, పి.వీరబాబులు గురువారం వెళ్లి స్థానిక నిర్వాహకులతో చర్చించారు. నల్లా వీధి వాహన కమిటీ ప్రతినిధులతో పోలీసు అధికారులు సమావేశమై ఊరేగింపు రోజు తీసుకుంటున్న జాగ్రత్తలపై అడిగి తెలుసుకున్నారు. చెడీ తాలింఖానాకు ఉపయోగించే ఆయుధాల వివరాలను కూడా సేకరించారు.



అమలాపురం దసరా ఊరేగింపు నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

శాశ్వత పట్టాలపై చర్చ

తాళ్లరేవు: డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల ద్వారా గతంలో ఇచ్చిన భూములకు శాశ్వత పట్టాలు ఇప్పించాలని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే పొన్నాడ వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1991లో 54 మందికి, డీఆర్‌డీఏ ద్వారా 1982లో 46 మందికి, సీఎస్ఎస్ స్కీం ద్వారా 1991–94 మధ్య 48 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 2.52 ఎకరాల చొప్పున భూమిని కేటాయించారు. ఆయా భూములను మత్స్యశాఖ సహాయంతో చెరువులుగా తవ్వి సాగు చేసుకుంటున్నారు. అయితే ఆయా భూములకు సంబంధించి పట్టాలు లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పొన్నాడ తహసీల్దార్ ఎస్.పోతురాజు, మండల సర్వేయర్ షరీఫ్, డీటీలు సూరిబాబు, పద్మ, మత్స్యశాఖ అధికారులతో చర్చించారు. శాశ్వత పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరులో జాతీయ రహదారి 216 నుంచి వలల తయారీ కేంద్రం వరకూ తుల్యభాగ నది వెంబడి రిటైనింగ్ వాల్, సీసీ రహదారుల నిర్మాణానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో ఆయా నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పొన్నాడ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పటవల సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, ఎంపీటీసీ సభ్యురాలు తణుకు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

నెల రోజుల్లోగా భవనాలు పూర్తి చేయాలి

అల్లవరం: మండలంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని పీఆర్ డీఈఈ రాజ్‌కుమార్ గురువారం అన్నారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, డీఈఈ రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన భవనాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరీష్, ఏఈ సంపత్, పరిపాలనాధికారి లక్ష్మణరావు, కార్యదర్శులు రాజమోహన్, రాజా, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ రాజ్‌కుమార్

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అమలాపురం రూరల్: అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని బాలయోగి సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్లలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ దుడ్డివారి అగ్రహారం, ఎన్ఎఫ్ రోడ్, గవర్నమెంట్ హాస్పటల్, నల్లవంతెన, వంటిద్దువారి వీధి, తామరచెరువు, వానపల్లివారి వీధి, రవణం మల్లయ్యవీధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా చల్లపల్లి ఫీడర్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం అమలాపురం నల్లవంతెన నుంచి ఎర్రవంతెన, ఆర్డీవో కార్యాలయం వరకూ శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ ఉండదని ఈఈ రవికుమార్ తెలిపారు.

మెడికల్ కాలేజీలో పోస్టులకు ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి కదిరికమమ్‌లోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఖాళీగా ఉన్న ల్యాబొరేటరీ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ వన్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా భర్తీ చేసే ఈ పోస్టులకు www.igmcri.edu.in వెబ్‌సైట్‌లో ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ

తాళ్లరేవు: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు అంగాడి నారాయణరావును ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం కొత్తూరులోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోమని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, స్థానిక సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు తణుకు వరలక్ష్మి తదితరులున్నారు.

దశలవారీగా విద్యుత్ చార్జీల తగ్గింపు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలోనూ దశలవారీగా విద్యుత్ చార్జీలను తగ్గించనున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి నమశ్శివాయం పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సెంట్రల్ పూల్ నుంచి కొనుగోలు చేస్తున్న విద్యుత్‌కు అధిక ధర చెల్లించాల్సి రావడంతో వినియోగదారులపై భారం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసి చార్జీలను తగ్గేలా చూడాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి వీకే సింగ్‌కు తాను లేఖ రాశానని చెప్పారు.

నిరంకుశ విధానాలు మానుకోవాలి

అమలాపురం రూరల్: జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారంటూ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ రావు తదితరులు జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జేసీకి అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి మహిళా, శిశు సంక్షేమ శాఖలో మిషన్ శక్తి సంబాల్ ఉమెన్ హెల్ప్‌లైన్ స్కీమ్ ద్వారా ఏడాది కాలానికి వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ముత్తుమీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హెల్ప్‌లైన్ అడ్మినిస్ట్రేటర్(మహిళా అభ్యర్థులు)–1, కాల్ ఆపరేటర్(మహిళ)–8, ఐటీ సూపర్‌వైజర్–1, మల్టీపర్పస్ స్టాఫ్ ప్యూన్–2, మల్టీపర్పస్ స్టాఫ్ హౌస్ కీపింగ్(మహిళ)–1, సెక్యూరిటీ గార్డు, నైట్‌గార్డ్–3 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా ఆయుధ పూజలు

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాల సందర్భంగా చెడీ తాలింఖానా ప్రదర్శనలు నిర్వహించే అమలాపురం పట్టణంలోని ఏడు వీధుల కమిటీలు ఆయుధ పూజలకు సమాయాత్తమవుతున్నాయి. దసరా ఉరేగింపుల్లో తలపడేందుకు ఉపయోగించే ఆయుధాలైన కత్తులు, కర్రలు, డాలు, లేడి కొమ్ములు తదితర వాటికి కొంకాపల్లి, నల్లా వీధి, మహిపాల వీధుల్లో గురువారం రాత్రి ఆయుధ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజలు పూర్తయిన తరువాతి రోజు నుంచి దసరా ఉత్సవాల వరకూ రోజూ చెడీ తాలింఖాన ప్రదర్శనలు నిర్వహించి కసరత్తు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

పోస్టర్ అవిష్కరణ

ఉప్పలగుప్తం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అలపూర్ నుంచి హైదారాబాద్ వరకూ జరగనున్న పాదయాత్ర పోస్టర్లను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం అవిష్కరించారు. కార్యక్రమంలో ఆకుమర్తి రమేష్, చేట్ల విద్యాసాగర్, వంగలపూడి నరసింహమూర్తి, ఎం.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యానాం అభివృద్ధికి విశేష కృషి

యానాం: యానాం నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ గతంలో కోట్లాది రూపాయలు మంజూరుచేసి పలు అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేసిందని యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మల్లాడి సత్తిబాబు, అర్ధాని దినేష్‌లు పేర్కొన్నారు. గురువారం పుదుచ్చేరి మాజీ సీఎం వైథిలింగం 74వ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని యానాంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

సురక్షతో ఇంటింటికీ వైద్యసేవలు

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్యసేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. గురువారం మండలంలోని ఉప్పలగుప్తంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో 387 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర క్యాంపును పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోకా శ్రీను, జగనన్న సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యిల రమణ, పార్టీ రైతువిభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, దొనిపాటి వేణు, ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, తహశీల్దార్ జె.వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని జిల్లా అదనపు డీఅండ్‌హెచ్‌వో భారతలక్ష్మి అన్నారు. గురువారం ఈదరపల్లి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మితో కలిసి ఆమె ప్రారంభించారు. శిబిరంలో 350 మంది రోగులకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయుడు వరలక్ష్మి, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, వైద్యులు ములపర్తి శాంతిలక్ష్మి, వాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: అందరి ఆరోగ్యానికి శ్రీరామరక్షగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అన్నారు. కాట్రేనికోన సచివాలయం వద్ద గురువారం ఆయన అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబు, సంసాని నాగేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, మోకా చంద్ర నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సఖిలే పెద్దిరాజు అన్నారు. గురువారం పశువుల్లంక సచివాలయం పరిధిలో ఆయన అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 512 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీకుమారి, ధూళిపూడి చక్రం, సుంకర నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలోని చొల్లంగిపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులు సుమారు 200 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ కందెళ్ల గంగాభవాని, మాజీ సర్పంచ్ మైదు హరిబాబు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాస్, కడియాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి



పశువుల్లంకలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్ సాగర్